క్లుప్తంగా

తల్లిదండ్రులతో సమావేశం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ సిద్ధరామయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వాటర్‌షెడ్ కమిటీ వారు విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలను అందించనున్నట్లు వెల్లడించారు.

నేడు కంటి వైద్యశిబిరం

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించన్నట్లు సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని శారద నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా చేయనున్నట్లు వివరించారు.

సచివాలయం తనిఖీ

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురం గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ టి. శ్రీనివాస విశ్వనాథ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

గృహసారథుల మండల కన్వీనర్‌గా ప్రకాష్‌రెడ్డి



సదుం: సచివాలయాల పరిధిలోని గృహసారథుల మండల కన్వీనర్‌గా జోగివారిపల్లెకు చెందిన ప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఈమేరకు జిల్లా గృహసారథుల ఇన్‌చార్జి శివశంకర్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చినట్లు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బైరెడ్డిపల్లి: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉండవచ్చని పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ తెలిపారు. శనివారం మండలంలోని జాలారిపల్లెలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఐరన్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లె పంచాయతీ కొల్లుపల్లెలో బాలసుబ్రమణ్యం అనే రైతు శనివారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. విద్యుత్‌శాఖ సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా సాయం చేయబోయిన రైతుకు కరెంట్ తీగ తగిలి చేయి పూర్తిగా కాలిపోయింది. బాధితుడు పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వైభవంగా పురంధరదాసు ఆరాధన

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో శనివారం వైభవంగా పురంధరదాసు ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. పురంధరదాసు చిత్రపటానికి ప్రాకారోత్సవం జరిపించారు. ఆనందరావు, రాజేష్, మోహన్, సుబ్బన్న, సుందరేష్, గురురాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దపంజాణి: మండలంలోని పొట్టగానిపల్లెలో ఈనెల 16వ తేదీన సంభవించిన అగ్ని ప్రమాదంలో గాయపడిన తిప్పక్క(58) అనే మహిళ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ వర్సిటీ ఫీజు గడువు పొడిగింపు

కుప్పం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూని వర్శిటీ డిగ్రీ 1, 2, 3 సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 25వ తేదీ వరకు ఏలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సకాలంలో ఫీజు చెల్లించాలని సూచించారు.

నేడు 'పీపీఎస్' వార్షికోత్సవం

పలమనేరు: పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం పలమనేరు పరిరక్షణ సమితి (పీపీఎస్) ఆరో వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, పోలీసులు నరసింహులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించి వారికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

బీజేపీ విధానాలపై పోరాటం

పలమనేరు: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని సీపీఎం నేత సుబ్బారావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించిన సీపీఎం కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



అప్పినపల్లె లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- అర్హులందరికీ పథకాలు
- ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారం
- సచివాలయాలతో పక్కాగా సేవలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

పెద్దపంజాణి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటి సంక్షేమ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం మండలంలోని అప్పినపల్లె, కుంబార్లపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుమారు 543 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దామని, పిల్లలకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు వెల్లడించారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు పక్కాగా చేరుస్తున్నట్లు వివరించారు. రేషన్ సరుకులను సైతం వలంటీర్లతో లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లె– పుంగనూరు రోడ్డు పనులు చేపట్టడడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, మాజీ చైర్మన్ ప్రహ్లాద, పెద్దపంజాణి, గంగవరం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బాగారెడ్డి, మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మన్ శంకరప్ప, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ హనుంతు, ఎంఈఓ హేమలత, ఏఈలు దేవేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు, సర్పంచ్‌లు సుజాత ధనంజయ, చంద్రశేఖర్, స్వర్ణలత, మురళి, ఎంపీటీసీ సభ్యులు చంద్రా రెడ్డి, మోహన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, స్థానిక నేతలు రాజారెడ్డి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం మండలంలోని మొరసనపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్ పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం జగనన్న ఎంతో ముందుచూపుతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతోనే కోవిడ్ కష్టాల్లో ప్రజలకు సేవలందించామని వెల్లడించారు. బడుగు జీవులను సంక్షేమ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. టీడీపీ హయాంతో తమ్ముళ్ల జేబులు నిండితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల కడుపు నిండుతోందని వివరించారు. రాబోయే ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీడీఓ హేమమాలిని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ సభ్యుడు ఆర్ముగం పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గడప గడపకు'

పలమనేరు: మండలంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విద్యాసాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేగౌడ ముందుగా తావడపల్లె, పెంగరగుంట, కోతిగుట్ట, జంగాలపల్లె, ఏటిగడ్డిండ్లు, మంగళవారం చిన్నకుంట, ఇంద్రానగర్, బండమీద ఇండ్లు, మొసలిమడుగు గ్రామాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెన్నెల

గుడుపల్లె: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ వెన్నెల మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడకుండా యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి వ్యాపారుల వినతి



వ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: బోయకొండలో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు శనివారం తిరుపతిలోని నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. షాపుల వేలం గడువు పెంచి మళ్లీ తమకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వ్యాపారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, నేతలు మునికృష్ణమనాయుడు, గంగిరెడ్డి, రెడ్డెప్ప, డిష్ సూరి పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సలీం



పుంగనూరు: బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పుంగనూరుకు చెందినన ఎంఎస్ సలీం నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. సలీం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి డైరెక్టర్‌గా నియమించేలా చర్యలు చేపట్టినందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలకు అండగా ఉంటున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని వెల్లడించారు.

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న కమిషనర్ కిరణ్‌కుమార్

పలమనేరు: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్లు, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇళ్ల పనులను మరింత వేగంగా పూర్తి చేయించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. దీనిపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, స్టీల్, ఇసుక సిద్ధంగా ఉందని వెల్లడించారు. జగనన్న కాలనీల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇంటి నిర్మాణంలో ఎవరికైనా ఇబ్బంది తలెత్తితే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

గంగవరం: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గంగవరం –2 (జనరల్), దండపల్లె-2(ఎస్సీ), తాళ్లపల్లె-2(జనరల్), గుండుగల్లు-1(జనరల్), మేలుమాయి-1(బీసీ మహిళ), జీడిమాకులపల్లె-1(జనరల్) మొత్తం 9 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఇంటర్ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు తమ ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతపరిచి ఈ నెల 25వ తేదీలోపు ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని సూచించారు. 30, 31వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి ఫిబ్రవరి 2వ తేదీన నియామక పత్రాలు అందజేస్తామని వెల్లడించారు.

గుడుపల్లె మండలంలో..

గుడుపల్లె: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైనవారు ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్ తెలిపారు. మండలంలోని శెట్టిపల్లె-1 (బీసీ మహిళ), కంచిమందార్లపల్లె-2 (జనరల్, బీసీ పురుషుడు), యామగానిపల్లె -1 (ఎస్సీ మహిళ), కొడతనపల్లె-1 (బీసీ మహిళ), సోడిగానిపల్లె-1 (బీసీ పురుషుడు) మొత్తం 6 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఆసక్తిగలవారు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు 31వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించి, ఫిబ్రవరి ఒకటో తేదీన వివరాలు ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

కలకలం రేపిన మూట

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ ఎస్. అగ్రహారంలో ఓ చెట్టుకు కట్టిన మూట శనివారం కలకలం రేపింది. మూట నుంచి రక్తం కారుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవికుమార్ అక్కడకు చేరుకుని మూటను కిందకు దింపించారు. తీరా అందులో మృతి చెందిన కోళ్లు ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా గుర్తించారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే గ్రామస్తులు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

దర్గా కమిటీ చైర్మన్‌గా కరీముల్లా



పుంగనూరు: పట్టణంలోని నూర్ షావలీ బాబా దర్గా కమిటీ చైర్మన్‌గా ఎస్‌కే కరీముల్లా ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన సమావేశంలో సున్ని అంజుమన్ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో దర్గా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో ముస్లిం నేతలు సయ్యద్‌మస్తాన్, జియాఉద్దీన్, జబ్బీర్, సాధిక్, నూర్, ఇమ్రాన్, సయ్యద్‌బాషా, బావాజాన్, అజ్గర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

రొంపిచెర్ల: బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. శనివారం రొంపిచెర్ల సచివాలయంలో గ్రామస్తులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం చేసుకుంటే ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో 104 ద్వారా వైద్యసేవలందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పంకజాక్షి, ఎంఎల్‌హెచ్‌పీ గీతశ్రీ, ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

శాంతిపురం: మండలంలోని 64 పెద్దూరు పంచాయతీలో టీడీపీకి చెందిన 49 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు యువరాజు, నాయకులు కోదండరెడ్డి, నిసార్ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



కొండచిలువను పట్టుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

గుడుపల్లె: సోడిగానిపల్లె నుంచి గుడుపల్లెకు వెళ్లే రోడ్డులో పాఠశాల వద్ద శనివారం ఉదయం ఓ కొండచిలువ హల్‌చల్ చేసింది. రోడ్డు దాటుతూ కనిపించిన కొండ చిలువను చూసి విద్యార్థులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.

బెదిరిపులపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: పెద్దచ్లారగుంటకు చెందిన రమేష్ అనే వ్యక్తి ప్రతి సోమవారం స్పందనలో తప్పుడు కారణాలతో అర్జీలు ఇస్తూ బెదిరిస్తున్నాడని పెద్దచల్లారగుంట, తాతిరెడ్డిపల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు తహసీల్దార్ కుమారస్వామికి ఫిర్యాదు చేశారు.

సచివాలయ కన్వీనర్‌గా ముర్వత్‌బాషా

పులిచెర్ల(కల్లూరు): సచివాలయ కన్వీనర్‌గా మంగళంపేటకు చెందిన ముర్వత్ బాషా నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లె రహదారి వద్ద ద్విచక్ర వాహనంలో 240 టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం కొత్తపల్లెకు చెందిన హరినాథ్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక మద్యం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదన్నారు.

సూపర్‌వైజర్ గైర్హాజరుపై ఫిర్యాదు



టీడీపీ ప్రెస్‌మీట్‌లో సూపర్‌వైజర్ పరమశివ

గంగవరం: ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ పరమశివ విధులకు డుమ్మా కొట్టిన ఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎక్సైజ్ సీఐ డీవీ చౌదరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కలగటూరు గ్రామానికి చెందిన పరమశివ పలమనేరులోని మద్య దుకాణంలో పనిచేస్తున్నాడన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నేతలు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాల్గొనేందుకు, విధులకు గైర్హాజరైనట్లు వెల్లడించారు. ప్రభుత్వంపైనే బురద జల్లే వ్యాఖ్యలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా పంట నమోదు

పలమనేరు: ఈ–క్రాప్‌లో పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఆర్‌బీకే సిబ్బందిని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం మండలంలోని మొరం పంచాయతీలో సాగుతున్న పంట నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాగు చేస్తున్నది పట్టాదారా, కౌలు రైతా అనే విషయం క్లారిటీగా ఆన్‌లైన్‌లో ఉండాలన్నారు. వివరాల నమోదులో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణదేవి, ఏఓలు సంధ్య, గీతాకుమారి, అమృతవల్లి, రాజ్యలక్ష్మి, నాగరాజు, అమృత పాల్గొన్నారు.

అంజనీపుత్ర, జై హనుమంతా



చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం వద్ద రద్దీ నెలకొంది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యప్రమాణాలు

దొంగతనం కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానితులు ఆలయం వద్ద సత్యప్రమాణాలు చేశారు. తొలుత వారు పుష్కరిణిలో మునిగి ఆల యం చుట్టూ మేళ తాళాల నడుమ ప్రదర్శనగా వచ్చి స్వామివారి పాదముద్రికలపై నిలబడ్డారు. తాము తప్పుచేయలేదని సత్య ప్రమాణం చేశారు.

రిజర్వాయర్ భూ సేకరణ పనులు వేగవతం



రాగానిపల్లె వద్ద జగనన్న కాలనీ భూసేకరణపై చర్చిస్తున్న కలెక్టర్ హరినారాయణ్, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: నియోజకవర్గంలోని సోమల మండలంలో నిర్మిస్తున్న ఆవులపల్లె రిజర్వాయర్ పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని, అలాగే దేశీయ ఆవుల ఉత్పత్తులను ప్రోత్సహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ హరినారాయణ్ ఆదేశించారు. శనివారం పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమల మండలం ఆవులపల్లెలో రూ.672 కోట్లతో 3.5 టీఎంసీల నీటి నిల్వల కోసం రిజర్వాయర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. నేతిగుట్లపల్లె రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలోని రాగానిపల్లె, గూడూరుపల్లె జగనన్న కాలనీలల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన 10 ఎకరాల భూమికి సంబంధించి అధికారులతో చర్చించారు. మండలంలోని తిమ్మికృష్ణాపురంలో రైతు హేమాని నిర్వహిస్తున్న దేశీయ ఆవుల డైయిరీని కలెక్టర్ పరిశీలించి, మొక్కలు నాటారు. వెటర్నరీశాఖ ద్వారా రూ.15 లక్షలు సబ్సిడీ మంజూరు చేశామని, ఉత్పత్తులు నెయ్యి, పాలు, పేడ, పిడకలను విక్రయించేలా ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో శివయ్య, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈలు ప్రసన్న, గణానాయక్, తహశీల్దార్ సీతారామన్ తదితరులు పర్యటించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పెద్దపంజాణి: కోగిలేరు పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో శనివారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దోమలు, ఈగల నివారణకు బ్లీచింగ్ హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు పరంధామ, పీఎస్ గణపతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. జీవితానికి భరోసా



డ్రైవర్లకు కరపత్రాలు అందిస్తున్న ఎంవీఐలు

పలమనేరు: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే జీవితానికి భరోసా ఉంటుందని ఎంవీఐలు ఆంజనేయప్రసాద్, భూషణ్‌రెడ్డి తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నై– బెంగళూరు మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాల డ్రైవర్లుకు నిబంధనలపై అవగాహన కల్పించి, కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు దీపిక, హరికిషోర్, సిబ్బంది మునిశేఖర్ పాల్గొన్నారు.

పుంగనూరు: రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రవాణాశాఖాధికారి రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం పట్టణంలో రహదారి భద్రత వారోత్సవాలను ఎస్‌ఐ మోహన్‌కుమార్‌తో కలసి నిర్వహించారు. రవీంద్రనాయక్ మాట్లాడుతూ మద్య సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. అతి వేగంగా డ్రైవింగ్ చేసి అనర్థాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా వేలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

వి.కోట: స్థానిక ఎండీహెచ్ సంస్థ నేతత్వంలో శనివారం అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో రహదారి భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలమనేరు ఎంవీఐ మధుసూదన్ పర్యవేక్షించారు.